క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలల్లో కనీస అవసరాలు తీర్చుకునేందుకు మంజూరైన స్కూల్ మెంటెనెన్స్ ఫండ్(ఎస్ఎంఎఫ్) సక్రమంగా వినియోగించుకోవాలని ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దననాయుడు అన్నారు. స్థానిక ఎంఆర్సీలో మంగళవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 140 పాఠశాలలకు ఎస్ఎంఎఫ్ నిధులు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన 52 పాఠశాలల్లో ఎస్ఎంఎఫ్ నిధులతో తాగునీరు, మరుగుదొడ్లు, ఎలక్ట్రిఫికేషన్, ఫర్నీచర్, ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దపాల్లలో వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఎంపీపీ బి.ఆదినారాయణ కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలందరికీ సక్రమంగా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ఇంటిముంగిటకే అన్ని సేవలు అందిస్తున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజిలి, వైద్యాధికారి భానుప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల అందజేత



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ జగన్మోహనరావు

వీరఘట్టం: విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని పాలమెట్ట సర్పంచ్ ఉదయాన జగన్మోహనరావు అన్నారు. గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం



ఎంపీడీఓ ఉమామహేశ్వరిని సన్మానిస్తున్న కార్యదర్శులు

భామిని: ఎన్నికల బదిలీల్లో భాగంగా విశాఖ జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, జి.చంద్రరావులను మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు, పౌరసేవల్లో ముందుంచే ప్రయత్నంలో ఒక్కోసారి సిబ్బందిపై పని ఒత్తిడి పెట్టాల్సి వచ్చేదని, కోపగించుకోవద్దని కోరారు.

రికార్డులు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతిభవానీ

భామిని: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన సరుకులకు సంబంధించిన రికార్డులను పూర్తిచేసి ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని సీడీపీఓ వి.శాంతిభవానీ అన్నారు. భామిని ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కేంద్రాలకు వచ్చిన సరుకులు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన సరుకుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ప్రాజెక్టు సీఓ వరలక్ష్మి, ఎస్ఓ జ్యోతిలక్ష్మి, రెండు క్లస్టర్ల పరిధిలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రికి వినతి



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌కేపీ ఉద్యోగులు

సాలూరు: వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారించాని కోరుతూ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు అతని స్వగృహంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఉద్యోగులు తెలిపారు.

మహాత్ముడి మార్గం అనుసరణీయం



పాలకొండ: వెంకమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో గాంధీజీ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు



కురుపాం: మహాత్మ జ్యోతీబాపూలే బాలుర పాఠశాలలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది



సీతంపేట: బాలికల ఆశ్రమ పాఠశాలలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం లిల్లీరాణి



పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, శాంతి మార్గాన్ని ఆయుధంగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్ముని గొప్పతనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మహాత్ముడు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్

అటవీ ఉత్పత్తుల కొనుగోలు వేగవంతం



సేల్స్‌మేన్లు, డీలర్లకు సూచనలు చేస్తున్న డీఎం

గుమ్మలక్ష్మీపురం: అటవీ ఉత్పత్తులు కొనుగోలులో వేగం పెంచాలని జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచ్‌లో సేల్స్‌మేన్లు, డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో లభిస్తున్న కరక్కాయలు, నల్లజీడి, ఎండు ఉసిరి, నరమామిడి చెక్కలు, తానికాయలు, ముషిడిక, ఇండుగ పిక్కలు తదితర ఫలసాయాల్లో నాణ్యమైన వాటిని కొనుగోలు చేయాలని సూచించారు. రేషన్ సరుకుల పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, గొడాం ఇన్‌ఛార్జ్ ఎం.సాంబశివరావు తదితరులున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో సత్తాచాటిన సీతంపేట



జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన జట్లు

సీతంపేట: 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో సీతంపేట మండల క్రీడాకారులు సత్తాచాటారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో దోనుబాయి సచివాలయం జట్టు విన్నర్‌గా నిలిచింది. క్రికెట్‌లో దారపాడు, ఖోఖోలో గొయిది జట్లు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్‌లో కడగండి సచివాలయ మహిళల జట్టు విన్నర్‌గా, పుబ్బాడ జట్టు రన్నర్‌గా నిలిచింది. కబడ్డీలో కుశిమి, షటిల్ బ్యాడ్మింటన్‌లో పులిపుట్టి సచివాలయ జట్లు రన్నర్లుగా నిలిచాయి. వీరంతా బుధవారం నుంచి జరిగే జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ తెలిపారు.

దాడులు సహేతుకం కాదు

పాలకొండ రూరల్: ఎన్ఎంయూ సభ్యులు, నాయకులపై విశాఖ డీపీటీఓ దాడులకు పాల్పడటం సహేతుకం కాదని ఎన్ఎంయూ పాలకొండ డిపో అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజేష్, ఎం.సుబ్బారావు కోరారు. ఈ దాడులను ఖండిస్తూ మంగళవారం స్థానిక డిపో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆర్టీసీ సంస్థకు నష్టం కల్పించేలా విశాఖ డీపీటీఓ పనిచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే దాడులు చేయటం సరికాదన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ పీఓ, వలంటీర్లు

జియ్యమ్మవలస: మండలంలోని చంద్రశేఖర రాజపురంలో చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శానిటైజర్‌తో చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓ సంజయ్‌కుమార్ చౌడ, అధ్యాపకులు గౌరీశంకరరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మండ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సీతంపేట: ఈతమానుగూడ, కొండాడ పంచాయతీల పరిధిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మండ జట్టు విజేతగా నిలిచింది. ఓంద్రుజోల జట్టు ద్వితీయ స్థానంలో, కల్లెమ్మ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు రూ.10 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.5 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుకుమార్, ఎస్.వెంకటేష్ ముకుందా, జమ్మయ్య, అప్పన్న, ప్రసాద్, చిన్నారావు, సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెరటితోటల సాగుతో అదనపు ఆదాయం



కూరగాయ విత్తన ప్యాకెట్లతో గ్రామస్తులు

భామిని: మండలంలోని కొత్తూరుగూడ, పుత్తూరు కాలనీలో స్ఫూర్తి సేవా సదన్ సంస్థ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పెరటి తోటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పెరటి తోటల పెంపకంపై దృష్టిసారించాలని కోరారు. అనంతరం కూరగాయల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఎం.భీష్మ, పెసిలిటేటర్ ఎం.జయరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన తప్పనిసరి



ర్యాలీలో పాల్గొన్న ఎంవీఐ వేణుగోపాలరావు, తదితరులు

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నింబంధనలపై అవగాహ పెంచుకోవడం ద్వారా రోడ్డ ప్రమాదాల నివారణకు సహకరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) తంగి వేణుగోపాలరావు కోరారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్‌పై, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా మితిమీరిన వేగం, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపటం వలన ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఆటో డ్రైవర్లతో కలిసి పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు



పాలకొండ రూరల్: క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: క్రీడల్లో ప్రతిభ కనబరచడం ద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, ఎంపీడీఓ డొంక త్రినాథులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు, నియోజకవర్గ, మండల క్రీడాపోటీల నిర్వాహకులు వి.పుష్పనాథం, రాకోటి రాములు, వ్యాయామోపాధ్యాలు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



ఘనసర కృషి ఎంటర్‌ప్రైజెస్ వద్ద ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణలో భాగంగా మంగళవారం పారిశ్రామిక సందర్శనకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ మాట్లాడుతూ.. సాధారణ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. ఘనసరలోని కృషి ఎంటర్‌ప్రైజెస్, గ్రామీణ విశాఖ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలాం ప్రైమ్ కంప్యూటర్ శిక్షణ కేంద్రం, గ్రామ సచివాలయాన్ని విద్యార్థులు సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. వృత్తి విద్యా కోర్సుల ఉపాధ్యాయులు, ఐటీ విభాగం నుంచి సీహెచ్ హరిప్రసాద్, అపెరల్ విభాగం నుంచి ఎం.వరలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సందడిగా గ్రామదేవత సంబరం



భక్తుల పూజలందుకుంటున్న ముత్యాలమ్మ తల్లి

భామిని: మండలంలోని బత్తిలిలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతైన ముత్యాలమ్మ సన్నిధిలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి మందిరం ప్రతిష్ఠోత్సవంలో భాగంగా శాంతి హోమం నిర్వహించారు. హరేరామ సంకీర్తనలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు.

మేరీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



మరియగిరి కొండపై కొవ్వొత్తులు వెలిగిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేట వద్ద మరియకొండపై వెలసిన మేరీమాతను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరినీ చల్లంగా చూడాలని మరియమాతను ప్రార్థించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఐఈఓ మంజులవీణ

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి మంజులవీణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాడు-నేడు కార్యక్రమం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 లక్షలతో కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు. పిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సత్ప్రవర్తనతో నడచుకోవాలని, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం జూనియర్ కళాశాల పిన్సిపాల్ జె.రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఐటీడీఏ పెట్రోల్ బంకు



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఐటీడీఏ పీఓ

కురుపాం: మండల కేంద్రం కురుపాంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఒకే పెట్రోల్ బంకు ఉండటం వల్ల వాహనదారులు కొంత ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం మండల కేంద్రంలో రెండో పెట్రోల్ బంకు అందుబాటులోకి రావడంతో ఇకపై పెంట్రోల్ కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. పెట్రోల్ బంకు సేవలన సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ రామయ్య

గుమ్మలక్ష్మీపురం: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, యువత సిగరెట్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య అన్నారు. కళాశాలలో మంగళవారం 'సిగరెట్లు, మత్తుపదార్థాల నిషేధంపై' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో యువత సిగరెట్లు, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుపదార్థాలు, ధూమపానం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. వాటికి దూరంగా ఉండాలని కోరారు. అంతకుముందు అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవాణి, శ్రీలక్ష్మి, వి.కల్పన, చిన్నారావు, ఎన్ఎస్ఎస్ పీఓ త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో పర్యటించే అర్హత లోకేష్‌కు లేదు



మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణరావు

వీరఘట్టం: పాలకొండలో పర్యటించే అర్హత టీడీపీ నేత నారా లోకేష్‌కు లేదని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు అన్నారు. చిదిమి గ్రామంలోని ఎంపీపీ నివాసంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఫిబ్రవరి 7న శంఖారావం పేరిట పాలకొండలో నారా లోకేష్ నిర్వహించే సభను ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 2017 సెప్టెంబర్ 11న ముఖ్యమంత్రి హోదాలో మండలంలోని తెట్టంగి గ్రామంలో పర్యటించిన నారా చంద్రబాబునాయుడు తెట్టంగిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని, పక్కా రోడ్లు, ఇంటింటికీ తాగు నీటి కుళాయి, పశువైద్యశాల, పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ అందులో ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా చంద్రబాబునాయుడు తెట్టంగి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు ఈ ప్రాంత ప్రజలను తప్పుడు హామీలతో మరోసారి మోసం చేసేందుకు నారా లోకేష్ వస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్న టీడీపీని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధానికి 'సిద్ధం'మని శంఖారావం మోగించడంతో టీడీపీ వెన్నులో వణుకు పుడుతోందన్నారు. ముందు పాలకొండ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన తరఫున పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వారితో పాటు చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు ఉన్నారు.